అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి బాధ్యత నాదే

- ప్రజలు మార్పు కోరుకోవడంతోనే కాంగ్రెస్ గెలుపు సాధ్యమైంది..
- ఎన్నికల్లో గెలుపోటములు ఉంటాయి.. పొంగిపోవద్దు.. కుంగిపోవద్దు..
- కాంగ్రెస్ ప్రభుత్వానికి కొంత సమయమిచ్చి తర్వాత ప్రజాసమస్యలపై పోరాడుదాం
- బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గస్థాయి సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, డిసెంబర్ 20: అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గంలో ఓటమి బాధ్యత తన దేనని, ప్రజాతీర్పును హుందాగా స్వీకరిస్తున్నానని, ఎవరిని తప్పు పట్టడం లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం నగరంలోని ఆయన స్వగృహంలో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడారు. గెలుపోటములు పక్కపక్కన తలుపులు లాంటివని, ఎప్పుడు ఏ తలుపు మూసుకుంటుందో.. ఏ తలుపు తెరుచుకుంటుందో ప్రజల నిర్ణయమన్నారు. అంబేద్కర్, ఎన్టీఆర్, ఇందిరాగాంధీ కూడా ఎన్నికల్లో ఓడిపోయిన వారేనని, ఆయన విలువ కొంచెమైనా తగ్గలేదన్నారు. గెలిచినపుడు పొంగిపోవడం.. ఓడినపుడు కుంగిపోవడం తన తత్వంకాదన్నారు. హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల జిల్లాల్లో ప్రజలదే పైచేయి అన్నారు. కానీ ఇతర జిల్లాల్లో అది సాధ్యం కాలేదన్నారు. ప్రజలు మార్పు కావాలని కోరుకుని కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. ఉద్యమ నేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ పెట్టిన రోజు అధికారమే పరమావధిగా భావించలేదన్నారు. ఒకరిద్దరి తప్పుల వల్ల బీఆర్ఎస్ అధికారం కోల్పోలేదని, ప్రజలు మార్పు కోరుకోవడం వల్లే ఓటమి పాలైందన్నారు. బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాడటానికి కొన్ని రోజులు ఆగాలని, కాంగ్రెస్ ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి గత ప్రభుత్వంపై అభాండాలు వేసేందుకు శ్వేత పత్రాలు విడుదల చేస్తున్నదని మాజీ మంత్రి మండిపడ్డారు. ఆచరణ సాధ్యం కాని హామీలు, లేనిపోని డిక్లరేషన్లు ఇచ్చి ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఐదేళ్లకు మించి పరిపాలన చేయలేదన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లోనే ఉచితం అమలు చేస్తున్నదని, అన్ని బస్సుల్లో ఉచితం చేస్తేనే పథకానికి సమగ్రత వస్తుందన్నారు. తాము అధికారంలోకి రాగానే రైతుల రుణాలను మాఫీ చేస్తానన్నారని, అధికారంలోకి వచ్చాక రుణమాఫీకి కొర్రీలు పెడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయడంలో, పార్టీకి పునః వైభవం తీసుకొచ్చే క్రతువులో నాయకులు, నేతలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సారథ్యంలో రాబోయే రోజుల్లో తాను ఉమ్మడి జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో పర్యటిస్తానన్నారు. అన్ని నియోజకవర్గాలకు చెందిన నాయకులతో మాట్లాడతానన్నారు. ఓటమిని సవాల్‌గా తీసుకుని పనిచేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, పార్టీ నగర అధ్యక్షుడు నాగరాజు, రఘునాథపాలెం జడ్పీటీసీ ప్రియాంక, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ దొరేపల్లి శ్వేత, నాయకులు కర్నాటి కృష్ణ, ఆర్జేసీ కృష్ణ, పలు డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.62 లక్షల గంజాయి స్వాధీనం

స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయితో ఎక్సైజ్ అధికారులు

సారపాక, డిసెంబర్ 20: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు బుధవారం 26.5 కిలోల ఎండు గంజాయి పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో లక్ష్మీపురం గ్రామానికి సీఐ సర్వేశ్వర్ ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లారు. ఒకచోట అనుమానాస్పదంగా ఉన్న మూడు బ్యాగులను పరిశీలించారు. వాటిలో ఉన్న 26.5 కిలోల ఎండు గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. ఈ బ్యాగుల సంబంధీకులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.6.62 లక్షలు ఉంటుందని సీఐ సర్వేశ్వర్ తెలిపారు.

కిరాణం షాపులో చోరీ

ఆళ్లపల్లి, డిసెంబర్ 20: మండలంలోని మర్కోడు గ్రామంలోగల కిరాణం షాపులో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... ఈ గ్రామస్తుడు రణం మల్లికార్జున్ మంగళవారం రాత్రి తన కిరాణం షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం ఆయన భార్య వచ్చేసరికి కిరాణం షాపు తలుపులు పగలగొట్టి ఉన్నాయి. ఆమె ఇచ్చిన సమాచారంతో పోలీసులు పరిశీలించారు. షాపులోని రూ.1.20లక్షల నగదు కనిపించలేదు. సీసీ కెమెరాలు ధ్వంసమయ్యాయి. మానిటర్ కూడా కనిపించలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సారపాక, డిసెంబర్ 20: సారపాకలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్సై రాజ్‌కుమార్ బుధవారం పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. సంబంధితులపై కేసు నమోదు చేశారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

కరకగూడెం, డిసెంబర్ 20: మండలంలోని రఘునాథపాలెం గ్రామస్తుడు గోగు నర్సింహారావు(38), కుటుంబ కలహాల నేపథ్యంలో గత శుక్రవారం మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడు బుధవారం మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడి తండ్రి గోగు లక్ష్మయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి

కరకగూడెం, డిసెంబర్ 20: మండలంలోని రాళ్లవాగు వద్ద బుధవారం అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పినపాక మండలం ఏడూళ్లబయ్యారం గ్రామస్తురాలు బంటు గోపమ్మ(60) నిరుపేద కూలీ. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. మండలంలోని అనంతారం గ్రామంలో ఉంటున్న పెద్ద కుమార్తె సారమ్మ వద్దకు ఆదివారం వచ్చి, సోమవారం తిరుగు ప్రయాణమైంది. ఆమె ఇంటికి చేరకపోవడంతో కుటుంబీకులు బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ తెలియలేదు. బుధవారం ఉదయం రాళ్లవాగు వద్ద బహిర్భుమికి వెళ్లిన యువకులు.. అక్కడ వృద్ధురాలి మృతదేహాన్ని చూసి వెంటనే పోలీసులకు తెలిపారు. ఎస్సై రాజారామ్, సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. ఆమె కుటుంబీకుల ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా ఎస్సై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నారు.

టీబీ కేంద్రాన్ని తరలించొద్దు

భద్రాచలం, డిసెంబర్ 20: భద్రాచలంలోని జిల్లా అదనపు క్షయ నివారణ కేంద్రాన్ని కొత్తగూడెం తరలించే యత్నాలపై ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు ఒక ప్రకటనలో తీవ్ర అభ్యంతరం, ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ కేంద్రాన్ని కొత్తగూడెం తరలించవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తరలింపు ప్రతిపాదనను విరమించుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారికి విజ్ఞప్తి చేశారు.

బీఎల్‌వోలకు శిక్షణ

సారపాక, డిసెంబర్ 20: ఓటరు నమోదుపై బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాల్లోని బీఎల్‌వోలకు బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం సారపాక క్లస్టర్ రైతు వేదికలో తహసీల్దార్ తిరుమలాచారి, మాస్టర్ ట్రైనర్ మోహన్ నిర్వహించారు. ఆర్‌ఐలు ముత్తయ్య, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ ఇల్లెందు కమిటీ ఎన్నిక

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 20: టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఇల్లెందు గోవింద్ సెంటర్‌లోని పెన్షనర్ భవనంలో బుధవారం జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా జయరాజు, ఉపాధ్యక్షురాలిగా అన్నపూర్ణ, కోశాధికారిగా బి.పాపారావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా అధ్యక్షుడు బి.కిషోర్ సింగ్ వ్యవహరించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830. NT-314474

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073. NT-314374

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

CHANGE OF NAME

* I, FAREENA CHANGED MY NAME AS MOHAMMAD FAREENA BAANU, W/o. MOHAMMAD MAHEBOOB KHAN, R/o. H.No. 9-7-172/1, SANYASI BASTHI KOTHAGUDEM - 507 101. BK.DIST. KMM-

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

'పెన్షనర్లు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

మాట్లాడుతున్న అధికారులు

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 20: పెన్షనర్ల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు సూచించారు. జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన పెన్షనర్స్ డే వేడుకల్లో ఎస్‌బీఐ పోస్టాఫీస్ ఏరియా బ్రాంచి మేనేజర్ మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులకు బ్యాంకులో ఉన్న పథకాలను వివరించారు. అవసరమునర్న పెన్షనర్లు రుణ సదుపాయాన్ని వినియోగించాలని సూచించారు. ఇన్సూరెన్స్ ట్రైనర్ దయాకర్, పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు ఈజీఎస్ వెస్లీ, యూనిట్ అధ్యక్షుడు ఎల్.రాములు కూడా వివిధ అంశాలపై మాట్లాడారు. పేద మహిళలకు చీరెలు, బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, భాస్కర్ పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వినతి

మణుగూరు టౌన్, డిసెంబర్ 20: తమకు హైపవర్ వేతనాలు అమలు చేయించాలని, ఇతరత్రా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) నాయకులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్డీ నాసర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్

చుంచుపల్లి, డిసెంబర్ 20: మండలంలోని గౌతంపూర్ కాలనీ పంచాయతీలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కొలిపాక సత్యనారాయణ, సుబ్బారెడ్డి, అబ్బులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కరుణాకర్, లక్ష్మణ్, రత్నకుమార్, రవీందర్, నారాయణ, చిన్ని పాల్గొన్నారు.

వరి రైతులకు అవగాహన

చుంచుపల్లి, డిసెంబర్ 20: కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని రైతులకు వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో వరి రైతులు వరి విత్తనాలను ఎకరానికి 15 నుంచి 20 కిలోల వెదజల్లుకోవచ్చని అన్నారు. పంట పదిరోజులు ముందుగానే కోతకు వస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారి రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

సీసీఐలో పొరపాట్లను సరిచేసుకోవాలి

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 20: సుజాతనగర్ మండలం డేగల మడుగులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా సందర్శించారు. సీసీఐ కేంద్రంలో పొరపాట్లు జరుగుతున్నాయని, పొరపాట్లను సరిచేసుకొని వెంటనే కాంటా వేయాలని కోరారు. సలిగంటి శ్రీనివాస్, భూక్యా దస్రు, కొమారి హనుమంతరావు, జక్కుల రాములు, భాస్కర్, తాళ్లూరి ధర్మారావు, బండి రమేశ్, మల్లేశ్, కృష్ణ, సాయి ప్రదీప్ పాల్గొన్నారు.

ధోబీఘాట్ పనుల పరిశీలన

ఇల్లెందు, డిసెంబర్ 20: పట్టణంలోని 18వ వార్డులో ధోబీఘాట్ పనులను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. రజక సంఘం నాయకుడు కృష్ణ పాల్గొన్నారు.

'కొవిడ్' పట్ల అప్రమత్తంగా ఉండాలి'

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 20: కొవిడ్ కేసులు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. కొవిడ్‌తో ఆందోళన అక్కరలేనప్పటికీ అప్రమత్తత ఎంతో ముఖ్యమని అన్నారు. మనుపటిలాగే అందరమూ సమష్టి కృషితో పనిచేసి తాజా కరోనా వైరస్ వేరియంట్లను కట్టడి చేద్దామని అన్నారు. కరోనాను నియంత్రించేందుకు ప్రతిఒక్కరూ చిన్న చిన్న జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

రక్తమోడిన ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం

ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు హతం

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 20 : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో యుద్ధమేఘాలు అలుముకున్నాయి.. కొన్నిరోజులుగా ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య భీకరపోరు కొనసాగుతోంది. బుధవారం ఇరువర్గాల మధ్య జరిగిన పోరులో ఆరుగురు మావోయిస్టులు నేలకొరిగినట్లు తెలుస్తోంది. వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా చింతల్నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారం- కొత్తపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు క్యాంపు నిర్వహించారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఉన్నతాధికారులు సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించారు. జిల్లా రిజర్వు గార్డ్స్(డీఆర్‌జీ), బస్తర్ ఫైటర్స్, కోబ్రా 201 బెటాలియన్ భద్రతాదళాల సంయుక్త ఆధ్వర్యంలో కూంబింగ్ ఆపరేషన్స్ ప్రారంభించారు. ఈక్రమంలో బుధవారం ఉదయం నాగారం- కొత్తపల్లి అడవుల్లో మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు జరిపారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులు ప్రారంభించారు. ఇరువర్గాల మధ్య సుమారు గంటన్నరపాటు భీకరయుద్ధం జరిగింది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీమార్గంలోకి పారిపోయారు. ఈ ఘటనలో సుమారు ఆరుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీస్ అధికారులు చెబుతున్నారు. సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ సైతం ఈ ఘటనపై స్పష్టత ఇచ్చారు. ఘటనా స్థలంలో మావోయిస్టుల క్యాంపుని ధ్వంసం చేసి, భారీగా పేలుడు పదార్థాలు, ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనపరుచుకున్నట్లు సమాచారం.

ముక్కోటి ఉత్సవాల సమాచార కరపత్రం విడుదల

కరపత్రాన్ని విడుదల చేస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ముక్కోటి వైకుంఠ ఏకాదశి మహోత్సవాల కోసం భద్రాచలం వచ్చే భక్తులకు సమాచార కరపత్రం ఎంతగానో ఉపయోగపడుతుందని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల పేర్కొన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ రూపొందించిన ఈ సమాచార కరపత్రాన్ని ఐడీవోసీలోని తన ఛాంబర్‌లో బుధవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉత్సవాల సమాచారాన్ని భక్తులు తెలుసుకోవడానికి ఈ కరపత్రం ఉపయోగపడుతుందని అన్నారు. దేవస్థానానికి సంబంధించిన సమగ్ర సమాచారంతోపాటు బస్సులు, రైళ్ల సమాచారం, ప్రసాదపు కౌంటర్లు, మరుగుదొడ్లు, పార్కింగ్ స్థలాలు, వైద్య కేంద్రాల వివరాలు ఇందులో పొందుర్చినట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, డీపీఆర్వో శ్రీనివాస్, జడ్పీ సీఈవో విద్యాలత, వైద్యాధికారి శిరీష, మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పాయం'కు సన్మానం

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న నాయకులు

మణుగూరు టౌన్, డిసెంబర్ 20: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును స్థానిక వేణు ఫంక్షన్ హాలులో బుధవారం మండల మున్నూరుకాపు సంఘం నాయకులు సన్మానించారు. వన్నం కృష్ణమోహన్ (అధ్యక్షుడు), గాండ్ల సురేష్ (కార్యదర్శి), వలసాల వెంకటరామారావు, గోపిశెట్టి శివయ్య, గాజుల కోటేశ్వరరావు, ఆవుల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

మై భారత్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 20: కేంద్రం ప్రారంభించిన మై భారత్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం జిల్లా యువజన అధికారి అన్వేష్ చింతల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోర్టల్‌లో యువతకు సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు, డిజిటల్ లెర్నింగ్, సాంకేతిక నైపుణ్యత అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇందులో పొందుపర్చారన్నారు. యువతీ యువకులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, మొబైల్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు.

పెద్దమ్మగుడి హుండీ ఆదాయం రూ. 26.72 లక్షలు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 20: మండలంలోని జగన్నాథపురం – కేశ్వాపురం గ్రామాల మధ్య గల పెద్దమ్మతల్లి దేవాలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయంలోని కళాక్షేత్రంలో బుధవారం జరిగింది. సెప్టెంబర్ 25 నుంచి ఈ నెల 19 వరకు భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలను దేవాదాయ ధర్మాదాయ అధికారుల సమక్షంలో లెక్కించారు. మొత్తం 86 రోజులకు గాను రూ.26,72,768 ఆదాయం వచ్చింది. మిశ్రమ బంగారం 430 గ్రాములు, వెండి 5 కిలోలు వచ్చింది. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి ఎన్.రజనీకుమారి, కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు బేల్‌సింగ్, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, ధర్మకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు గురుకులం విద్యార్థినులు

ములకలపల్లి, డిసెంబర్ 20: రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ములకలపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అఖిలసాయి, దివ్యశ్రీ, లోహిత, ఇందు, భావన, శ్రీహర్షిత ప్రతిభ చాటి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. వీరిని ప్రిన్సిపాల్ సునీతతోపాటు పీడీ నాగమణి, పీఈటీ సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు.

సురక్షిత ప్రసవాలపై శిక్షణ

టేకులపల్లి, డిసెంబర్ 20: సురక్షిత ప్రసవాలపై మండలంలోని సులానగర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ శిరీష బుధవారం శిక్షణ ఇచ్చారు. కాన్పుల సంఖ్య పెంచాలన్నారు. డాక్టర్లు దుర్గాభవాని, చైతన్య, డీపీహెచ్ఎన్ అన్నామేరి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అయ్యప్పల పడిపూజ

పాల్వంచ, డిసెంబర్ 20: పాత పాల్వంచలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామి పడిపూజను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పడిపూజ, భజన కార్యక్రమంలో గురుస్వాములు బండెల శ్రీనివాసరావు, మల్లెల నాగేంద్రం, పాండురంగాపురం చారీ, ముదిగొండ వెంకన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఇరుముడి కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది.

మెయిన్ వర్క్‌షాప్‌లో హెచ్ఎంఎస్ నాయకుల ప్రచారం

రామవరం, డిసెంబర్ 20: సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ మెయిన్ వర్క్‌షాప్‌లో హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల పక్షాన నిలబడిన హెచ్ఎంఎస్ పోరాట పటిమను గుర్తించాలని కోరారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ సంఘాన్ని ఆదరించాలని అన్నారు. సంఘం నాయకులు రమణారావు, గౌస్, గోడ రమేశ్, యాకూబ్, ఆంజనేయులు, ఆసిఫ్, ప్రసాద్, గంగాధర్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌మ్యాన్ పవన్‌కు సింగరేణి అధికారుల సన్మానం

రామవరం, డిసెంబర్ 20: సింగరేణి కొత్తగూడెం ఏరియా వీకే 7 గనిలో స్పోర్ట్స్ మ్యాన్ పిల్లి పవన్ ఫిట్టర్ కోల్ ఇండియా లెవల్‌లో పవర్ వెయిట్ కాంపిటేషన్‌లో మూడో బహుమతితో విజయం సాధించారు. ఈ సందర్భంగా వీకే 7 గని మేనేజర్ ఆధ్వర్యంలో అధికారులు అతడిని సన్మానించి అభినందించారు. తెలిపారు. అధికారులు గోదావరి శ్రీనివాస్, అభిలాశ్, ఓంప్రకాశ్, బోరింగ్ శంకర్, కోటేశ్వరరావు, కుమార్‌రావు, సురేశ్, ప్రసాద్, వెంకన్న, డేవిడ్ పాల్గొన్నారు.

జవాన్లు, విద్యార్థుల రక్తదానం

భద్రాచలం, డిసెంబర్ 20: ముక్కోటి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైతే అందించేందుకు భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఆయన ఎటపాకలోని 212 బెటాలియన్‌ను సంప్రదించారు. అక్కడి జవాన్లు పదిమంది బుధవారం భద్రాచలం ఆస్పత్రిలో రక్తదానం చేశారు. ఎటపాకలోని పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కూతడా బుధవారం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు వచ్చి రక్తదానం చేశారు. వారికి సర్టిఫికెట్లను సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ అందించారు.

ఈజీఎస్ సామాజిక తనిఖీ

ములకలపల్లి, డిసెంబర్ 20: ఉపాధి హామీ పథకం(ఈజీఎస్) సామాజిక తనిఖీ కార్యక్రమం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. 2022-23 సంవత్సరానికిగాను మండలవ్యాప్తంగా రూ.5,27,51,518 విలువైన పనులు జరిగాయి. రూ.23,732 దుర్వినియోగమైనట్లుగా తనిఖీ అధికారులు గుర్తించారు. ఆ మొత్తాన్ని తిరిగి రాబట్టనున్నారు. జరిమానాగా మొత్తం రూ.14.000 విధించారు. ఈ వివరాలను అడిషనల్ డీఆర్‌డీవో రవి తెలిపారు. ఎంపీపీ మట్ల నాగమణి, విజిలెన్స్ అధికారులు రమణ, అనూష, నాగప్రకాష్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో లక్ష్మయ్య, ఎస్ఆర్‌పీలు పాల్గొన్నారు.

దీపాలంకరణ విజేతలకు బహుమతులు

మణుగూరు టౌన్, డిసెంబర్ 20: సింగరేణి డే సందర్భంగా సింగరేణి కుటుంబాల్లోని, స్థానిక మహిళలకు బుధవారం పీవీ కాలనీలోని కమ్యూనిటీ హాలులో దీపాలంకరణ పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులను సింగరేణి మణుగూరు ఏరియా ఎస్వోటూ జీఎం వీసం కృష్ణయ్య ప్రదానం చేశారు. ఇల్లెందు లేడీస్ క్లబ్ సెక్రటరీ కవిత, సభ్యులు రమ, భాస్కరి, కవిత, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సింగు శ్రీనివాస్, సేవా సెక్రటరీ షాకీరా తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన 'గుప్తనిధుల' గ్యాంగ్

వివరాలు వెల్లడించిన కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

లక్ష్మీదేవిపల్లి, డిసెంబర్ 20 : ఎలాంటి కష్టం చేయకుండానే చేతినిండా డబ్బులు వచ్చాయని ఆశపడిన గ్యాంగ్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కింది. గుప్తనిధుల పేరుతో ఏకంగా రూ.2 కోట్లకు టోకరా వేయాలని చూసిన వారిని రక్షకభటులు అదుపులోకి తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ పెద్దన్నకుమార్‌తో కలిసి కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ ఆ వివరాలు వెల్లడించారు. అరెస్టు అయిన వారిలో బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరకు చెందిన మానికల కృష్ణ, రవి, నకిరిపేటకు చెందిన ధరంసోత్ శ్రీను, తేజావత్ శివ, బానోత్ నరేశ్, పాల్వంచ మండలం శ్రీనివాసకాలనీకి చెందిన గూడవల్లి ప్రశాంత్ ఉన్నారు. పరారీలో మోరంపల్లి బంజరకు చెందిన నేల్లుల వెంకన్న, ములకలపల్లి మండలం పూసుగూడెంకు చెందిన లక్ష్మణ్, అదే గ్రామానికి చెందిన భూక్యా నాగ, పూసుగూడేనికి చెందిన తేజావత్ రాము, నరికిపేటకు చెందిన ధరావత్ రవి ఉన్నారు. మానికల కృష్ణ ఆధ్వర్యంలో ఒక గ్యాంగ్ ఏర్పడి గత కొంత కాలం నుంచి గుప్తనిధుల పేరుతో ప్రజలను మోసం చేస్తూ వచ్చిన డబ్బులతో జల్సా చేస్తున్నారు. ఈక్రమంలో సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన గొర్రెల వ్యాపారులు బోయిన బుచ్చయ్య, వేల్పుల కిరణ్, కనకటి లింగయ్యను ఎంపిక చేసుకొని తమ వద్ద గొర్రెలు ఉన్నాయని చెప్పి పాల్వంచకు పిలిపించారు. వారిని సాటివారిగూడెం వద్ద మొర్రేడువాగు అడవిలోకి తీసుకెళ్లి మా దగ్గర గొర్రెలు లేవని, గుప్తనిధులకు సంబంధించి రూ.2 కోట్లు ఉన్నాయని చూపించారు. రూ.50 లక్షలు ఇస్తే ఈ రూ.2 కోట్లు ఇస్తామని చెప్పి అందులోని రూ.50 వేలు వారికి ఇచ్చి నమ్మించారు. వారు నమ్మి ఈ నెల 9వ తేదీన రూ.40 లక్షలు తీసుకొచ్చి గ్యాంగ్‌కు ఇచ్చారు. వారు గొర్రెల వ్యాపారులకు తెల్ల కాగితపు కట్టలను తెల్ల సూపర్ బస్తాల్లో ప్యాక్ చేసి రూ.2 కోట్లుగా చెప్పి ఇచ్చి పంపించారు. ఈ నేపథ్యంలో ఇల్లెందు క్రాస్‌రోడ్ వద్ద లక్ష్మీదేవిపల్లి ఎస్సై బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో వస్తున్న గ్యాంగ్ పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.30,46,000 నగదుతోపాటు కారును సీజ్ చేశారు.

లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్